# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

13 | హైదరాబాద్, సోమవారం 4 మార్చి 2024 | VIKARABAD




**అడుగంటిన భూగర్భ జలాలు**

**ఎండుతున్న పంటలు**

**విద్యుత్తు కోతలతో**


**అన్నదాతల సతమతం**

**భారీగా తగ్గిన**

**వరి సాగు విస్తీర్ణం**

**గతంలో 7500 ఎకరాల్లో ..**

**నేడు 4000 లోపే..**



బోడకొండలో ఎండిపోతున్న వరి పంట

నెర్రులు బారిన పంటను చూసి రైతన్న కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నయ్.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెంపులేకుండా కరెంట్.. పుష్కలంగా సాగునీరు ఉండడంతో ఎవుసం సాఫీగా సాగింది.. కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కరువును తెచ్చింది.. జలధార వెనుకపట్టు పట్టింది.. బోరుబావుల్లో ఊట తగ్గింది.. కరెంటు అయినా పొద్దంతా వస్తే వరుస తడులతోనైనా పంటకు నీరు పెడుదామంటే కరెంట్ కోతలతో నాలుగు ఎకరాలు పారే బోరుబావి అర ఎకరం కూడా పారడం లేదు.. ఎంత కష్టమొచ్చే దేవుడా.. అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

# రైతన్నకు కన్నీళ్లే..

మంచాల, మార్చి 3 : అడుగంటుతున్న భూగర్భజలాలు.. విద్యుత్తు కోతలతో వరి పంట పొలాలు ఎండిపోతున్నాయి. బోరుబావుల కింద కొద్దిపాటి వరి నాట్లు వేసిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఈ ఏటా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో బోరుబావుల్లోని నీరు తగ్గి పంటపొలాలు ఎండిపోతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లోని రైతులు ప్రతి యాసంగి సీజన్‌లోనూ 7500 ఎకరాలకుపైగా వరి పంటను సాగు చేస్తుంటారు. ఈసారి మాత్రం కేవలం 4000 ఎకరాల్లోనే సాగు చేశారు. దీంతో ఒక్కసారిగా వరి పంట సాగు విస్తీర్ణం పడిపోయింది.

**తగ్గిన భూగర్భ జలాలు..**

గతంలో 500 అడుగుల లోతుకు బోరు వేస్తే వాటర్ వచ్చేవి. ప్రస్తుతం ఈ ఏటా సరిపడా వర్షాలు కురియక పోవడంతో 700-1000 అడుగుల లోతుకు బోరు వెస్తున్నా.. చుక్క నీరు రావడం లేదు. ఇలా గ్రామాల్లో భూగర్భ జలాలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. బోరుబావుల్లోనూ నీరు తగ్గుతుండడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఎండలు ముదరక ముందే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో కనీసం పాడి పశువులకైనా నీరు దొరుకుతుందా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**వేధిస్తున్న కరెంట్ సమస్య..**

వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తును సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 10 గంటలు కూడా రావడంలేదు. వ్యవసాయ బావులకు విద్యుత్తు ఎప్పుడు వస్తుందో.. పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఉన్న కొద్ది పాటి నీటిని పంట పొలాలకు పెడుదామంటే కరెంట్ సమస్యతో రైతన్నలు ఇబ్బందిపడుతున్నారు.

### సాగు విస్తీర్ణం తగ్గింది..



మంచాల మండలంలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో 7500 ఎకరాలకుపైగా ఉండగా.. ప్రస్తుతం నాలుగు వేల ఎకరాల్లోనే రైతులు సాగు చేస్తున్నారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతోనే పంటల సాగును తగ్గించారు. ఈ సమయంలో రైతులను ఆరుతడి పంట వైపు చైతన్యపరుస్తున్నాం.

– జ్యోతిశ్రీ, వ్యవసాయ శాఖ అధికారిణి

### విద్యుత్తు సమస్యను పరిష్కరిస్తున్నాం



వ్యవసాయ బోరుబావులకు విద్యుత్తు సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో విద్యుత్తు సమస్య తలెత్తినట్లు ఫిర్యాదు అందిన వెంటనే సిబ్బంది వెళ్లి పరిష్కరిస్తున్నారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి లోపాలు లేవు.. లో ఓల్టేజీ సమస్యా లేదు.

–సత్యనారాయణ, ఏఈ, మంచాల


## చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి



మణికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ శశాంక

షాబాద్, మార్చి 3: ఐదేండ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, మాట్లాడారు. ఎవరైనా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించకపోతే సోమ, మంగళవారాల్లో వేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పోరుకు రెడీ !



- మహబూబ్ నగర్ స్థానిక సంస్థల మండలి పోరుకు రాజకీయ పార్టీల సన్నద్ధం
- నేడు నోటిఫికేషన్ విడుదల
- రంగారెడ్డి జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఓటు వేయనున్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియల్ సభ్యులు
- బీఆర్ఎస్ గెలుపునకు అనుకూల పరిస్థితులు !

రంగారెడ్డి, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : లోక్ సభ ఎన్నికలకు ముందే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి నెలకొన్నది. మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఎన్నికల కోడ్ సైతం ఇప్పటికే మొదలైంది. అన్ని రాజకీయ పార్టీలు ఈ ఎన్నికకు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. బలమైన అభ్యర్థుల ఎంపిక కోసం రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తుండగా.. స్థానిక సంస్థల్లో ఉన్న బలాబలాలను బట్టి బీఆర్ఎస్ గెలుపునకే అనుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయి.

**జిల్లాలో 171 మంది ఓటర్లు..**

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీగా ఉన్న కశిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ స్థానానికి ఖాళీ ఏర్పడింది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, కొత్తూరు, చౌదరిగూడెం, నందిగామ మండలాలు మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ పరిధిలో ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 171 మంది ఓటర్లు ఉండగా.. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్ ఆఫీషియల్ సభ్యులు ఓటు వేయనున్నారు. ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల నేతల్లోనూ మండలి పోరు టెన్షన్ నెలకొన్నది.

**ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు..**

ఎమ్మెల్సీ స్థానానికి ఫిబ్రవరి 26న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. మార్చి 4న నోటిఫికేషన్ విడుదల కానున్నది. నామినేషన్ల దాఖలుగా మార్చి 11 గడువు కాగా.. 12న నామినేషన్ల పరిశీలన, 14 వరకు ఉప సంహరణ గడువును నిర్దేశించారు. 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా.. ఏప్రిల్ 4తో ఎన్నికల ప్రక్రియ పూర్తి కానున్నది. ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల సంఘం ఏర్పాటు చేస్తున్నది. ఈక్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని మండల పరిషత్తు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. షెడ్యూల్ విడుదలతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీమ్‌లను సైతం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**బీఆర్ఎస్‌కే అనుకూలం !..**

గతంలో జరిగిన మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున కశిరెడ్డి నారాయణరెడ్డిని నిలబెట్టి ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ స్థానిక సంస్థల్లో మెజార్టీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. దీనికి తోడు అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రస్తుతం అన్నివర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత ఉన్నది. ఇవన్నీ కూడా బీఆర్ఎస్‌కు అనుకూలించే అంశాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

## తీగ లాగితే... డొంక కదిలింది..

**30 కేసుల్లో నిందితుడు..**

**ఒక్క సీసీకెమెరాతో పట్టుబడిన వైనం..**

ఇబ్రహీంపట్నం, మార్చి 3 : చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతూ.. తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను సీసీ కెమెరాల సాయంతో పట్టుకుని తీగ లాగితే.. 30 కేసుల్లో నిందితుడిగా తేలిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బుద్దర గ్రామానికి చెందిన వడ్డె పోచయ్య దొంగతనాలే వృత్తిగా చేసుకుని గత ఆరు సంవత్సరాలుగా అనేక ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. గత నెల 25న రాత్రి ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగుళూరు గ్రామంలోని కనకదుర్గ దేవాలయంలో 3 తులాల బంగారం చోరీకి పాల్పడ్డాడు. అమ్మవారి మెడలోని బంగారు పుస్తెలతాడుతో పాటు ఇతర నగలను ఎత్తుకెళ్లాడు. ఈ విషయమై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా, చేసిన చోరీలన్నీ బయటకొచ్చాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధితో పాటు దుబ్బాక, సిద్దిపేట, తదితర జిల్లాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇతడిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 30 కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి బంగారం రికవరీ చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

## నేడు ప్రజావాణి రద్దు

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

షాబాద్, మార్చి 3: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో, గ్రామాల్లో ధరణి సదస్సులు నిర్వహిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

# పదేండ్ల పాలనలో బీజేపీ చేసింది ఎందో చెప్పాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**



రాయికల్‌లోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

షాద్‌నగర్, మార్చి 3 : పదేండ్ల పాలనలో మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ర్టానికి చేసింది ఏమి లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ సమీపంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ బియ్యం ఇచ్చినం, మరుగుదొడ్లు కట్టిచ్చినం, ఈజీఎస్ పనులు చేసినం.. అని చెప్పడం తప్పా తెలంగాణ అభివృద్ధికి చేసింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని, ఏ మొహం పెట్టుకొని తెలంగాణలో ఓట్లు అడుగుతారో బీజేపీ నాయకులు చెప్పాలని అన్నారు. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారని, ప్రజల ఆరోగ్యంపై కనీస శ్రద్ధ చూపలేదని అన్నారు. దేశ ప్రధాని మోదీ, అమిత్‌షా వంటి నేతలు పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఏర్పాటును తప్పుపట్టారని, తెలంగాణ అమరవీరులను అవమానపర్చారని మండిపడ్డారు. దేశంలో బీజేపీని వ్యతిరేకించే నాయకులపై సీబీఐ, ఈడీలతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 90 రోజుల్లోనే ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ బస్సులో మంత్రి ప్రయాణం...**

**సీట్ల సమస్యకు పరిష్కారం చూపాలని వినతి**

మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ప్రయాణికుల వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించే క్రమంలో భాగంగా ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఉచిత ప్రయాణం ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్సుల్లో సీట్లు సరిపోవడం లేదని, బస్సుల సంఖ్యను పెంచాలని పలువురు ప్రయాణికులు మంత్రి దృష్టికి తెచ్చారు. త్వరలో బస్సుల సంఖ్యను పెంచుతామని వివరించారు.

# కనుల పండువగా మల్లన్న కల్యాణం



షాబాద్ మండలం కుమ్మరిగూడలో ఎల్లమ్మ తల్లికి ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

షాబాద్, మార్చి 3: షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో మల్లన్న కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని మల్లన్న దేవాలయం వద్ద ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12గంటలకు మల్లన్న, గొల్లకేతమ్మ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం మహిళలు మల్లన్న, ఎలమ్మ దేవాలయాలకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామం మార్మోగింది. సాయంత్రం దేవాలయ ఆవరణలో అగ్గి గుండాలు తొక్కే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గతేడాది నూతనంగా మల్లన్న దేవాలయాన్ని నిర్మించగా, ఈ ఏడాది నుంచి కొమురవెళ్లి మల్లన్న కల్యాణం జరిగిన తర్వాత కుమ్మరిగూడలో మల్లన్న కల్యాణం జరిపిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణంలో పాల్గొన్నారు. దేవాలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు పోనమోని కేతన, పెద్దగోల్ల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ పోచయ్య, గ్రామ పెద్దలు రమేశ్‌యాదవ్, మంచాని నారాయణరెడ్డి, కుమార్‌యాదవ్, కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, అంజయ్య, శ్రీశైలం, కుమార్, శ్రీనివాస్, మల్లేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కొలువు కొట్టారు..

బొంరాస్‌పేట, మార్చి 3 : వారంతా చిన్నప్పటి నుంచి కష్టపడి చదివారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రావడంతో రాత్రింబవళ్లు చదివి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇటీవల ప్రకటించిన గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్, టీజీటీ ఉద్యోగాలను సాధించారు దుద్యాల, బొంరాస్‌పేట మండలాల్లోని యువతీయువకులు.

**మూడు ఉద్యోగాలకు ఎంపికైన సంగు అన్నపూర్ణ..**



దుద్యాల మండలంలోని లగచెర్లకు చెందిన సంగు అన్నపూర్ణ కోటి ఉమెన్స్ కళాశాలలో తెలుగులో పీజీ చదివింది. రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి బీఈడీ పూర్తి చేసింది. భర్త నరేశ్‌తో పాటు పోటీ పరీక్షలకు కష్టపడి చదివింది. గురుకుల డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, టీజీటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసింది. ఇటీవల ఫలితాలు ప్రకటించిన ఈ మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. గత ఏడాది కేజీబీవీ ఉపాధ్యాయుల ఎంపిక కోసం నిర్వహించిన పరీక్షలో జిల్లాలోమొదటి ర్యాంకు సాధించిన అన్నపూర్ణ ప్రస్తుతం వికారాబాద్ కేజీబీవీలో తెలుగు పండిట్‌గా పని చేస్తున్నది. వ్యవసాయ కుటుంబానికి చెందిన అన్నపూర్ణ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై కుటుంబంతో పాటు గ్రామస్తులు అభినందిస్తున్నారు.

**డీఎల్ ఉద్యోగానికి ఎంపికైన మధుసూదన్‌రెడ్డి..**



దుద్యాల మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన వన్నారెడ్డి, పార్వతమ్మల కొడుకు మధుసూదన్‌రెడ్డి గురుకుల డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తండ్రి చనిపోయినా చిన్నాన్న పుల్లారెడ్డి ప్రోత్సాహంతో వికారాబాద్ ఎస్‌ఏపీ కళాశాలలో డిగ్రీ, ఓయూలో ఎంఎస్సీ చదివాడు. పాండిచ్చేరి ఎన్ఐటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడు. కష్టపడి చదివి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించాడు.

**టీజీటీ ఉద్యోగానికి ఎంపికైన సుజాత..**



కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన సుజాత బొంరాస్‌పేట మండలంలోని బాపల్లితండాకు చెందిన గోపాల్‌ను ప్రేమ వివాహం చేసుకున్నది. పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి బీఈడీ పూర్తి చేసిన సుజాత భర్త ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు ప్రిపేరైంది. కష్టపడి చదివి సాంఘిక శాస్త్రం టీజీటీ ఉద్యోగానికి ఎంపికైంది. ఆమెను పలువురు తండా ప్రజలు అభినందించారు.